క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

మదనాపురం: మండలంలోని ఎర్రగట్టు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి కలశ పూజ, హోమం తదితర పూజలు చేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తాగునీటి వసతి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వెండి ఆభరణం అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో గల స్వామివారికి 25తులాల వెండి ఆభరణాన్ని గ్రామానికి చెందిన రంగాపురం యశోదమ్మ, చిన్నారెడ్డి దంపతులు బుధవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో పెద్ద శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, పూజారి శ్రీనివాసులు, సుంకరి యాదయ్య, జి.రఘువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పాన్‌గల్: వీపనగండ్ల మండల కేంద్రంలో వచ్చే నెల 9, 10వ తేదీల్లో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు ఐకమత్యంతో పనిచేయాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని రేమద్దులలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యానాయక్ మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేయాలని, దీంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరాలు సేకరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త ఉద్యమిస్తూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 24వ తేదీన పాన్‌గల్ మండల మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మహాసభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో అన్ని అంశాలపై చర్చించి పోరాటాలపై కార్యచరణను సిద్ధం చేస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, బాల్‌రెడ్డి, మండల నాయకులు వెంకటయ్య, వేణుగోపాల్, ఆంజనేయులు, భగత్, జంబులయ్య, వెంకటయ్య, గ్రామాల శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొట్టడంతో వృద్ధుడికి గాయాలు

గోపాల్‌పేట: ఆర్టీసీ బస్సు వృద్ధుడిని ఢీకొట్టిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఏదుల మండలంలోని సింగాయిపల్లికి చెందిన పూర్ణకంటి శంకరయ్య అనారోగ్యం బారిన పడడంతో చికిత్స కోసం గోపాల్‌పేటకు వచ్చాడు. స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని తిరిగి సొంత గ్రామానికి వెళ్లేందుకు బస్టాండు సమీపంలో రోడ్డుపై నిల్చున్నాడు. గ్రామానికి వెళ్లేందుకు కొల్లాపూర్ బస్సు రాగా బస్సు ఎక్కేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో గేర్ బాక్స్‌లో రిపేర్ వచ్చి బస్సు ముందుకు కదిలింది. దీంతో శంకరయ్య కిందపడిపోగా బస్సు కాలుపైకి ఎక్కింది. దీంతో శంకరయ్య కాలి వేళ్లు, మెడిమ వద్ద నుజ్జునుజ్జు అయింది. వెంటనే గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్ పరిశీలించారు.

మాజీ సర్పంచుపై దాడి: కేసు నమోదు

ఖిల్లాఘనపురం: భూ తగాదాలతో మాజీ సర్పంచ్‌పై దాడి చేసిన ఘటన మండలంలోని మానాజీపేటలో మంగళవారం రాత్రి చోటు చేసుకోగా.. బుధవారం బాధితుడు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం మానాజీపేటకు మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్ కు, అదేగ్రామానికి చెందిన రాజనాల బాలరాజు, రాజనాల అంజనేయులు మధ్య భూతగాదాలు ఉన్నాయి. సతీష్ కొనుగోలు చేసిన పొలంలో బాలరాజు, అంజనేయులు మంగళవారం రాత్రి సమయంలో వేరుశనగ విత్తనాలు వేస్తున్నట్లు సమాచారం రావడంతో.. సతీష్ పొలం దగ్గరికి వెళ్లాడు. పొలం వద్ద రెండు వర్గాల మధ్య మాటామాట పెరిగి గొడవ పెద్దదైంది. ఈ సమయంలో చేతిలో ఉన్న కర్రలతో సతీష్‌కుమార్‌పై వారు దాడి చేశారు. దాడిలో చేయి, కాలు విరగడంతో పాటుగా తలకు రక్తగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. చికిత్స నిమిత్తం బాధితుడిని మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడి భార్య మందుల స్వరూపారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం గ్రామానికి చెందిన ఎన్. రాకేష్‌రెడ్డి ఆగస్టు 28న మండల కేంద్రంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై ఖిల్లాఘనపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేసి ఫోన్ రికవరీ చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. బుధవారం రాకేష్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఫోన్ అప్పగించామన్నారు.



కొత్తకోటలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ డీకే అరుణ



పెబ్బేరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

సరస్వతి దేవిగా అమ్మవారి దర్శనం

దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం జిల్లావ్యాప్తంగా అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారి వద్ద తల్లిదండ్రులు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలువురు భక్తులు విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. కొత్తకోట కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎంపీని శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూర్‌లోని వాసవీమాత ఆలయంలో..



పానగల్‌లో..



అజ్జకొల్లులో..



ఆత్మకూర్‌లోని వాల్మీకినగర్‌లో పూజలో భక్తులు



ఖిల్లాఘనపురంలో..



అమరచింత కాళికాలయంలో..

చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుని ముద్దులగుమ్మా..



ఆత్మకూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆత్మకూర్: చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుని ముద్దులగుమ్మ అంటూ మహిళల బతుకమ్మ సంబురాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం రాత్రి వేపకాయల బతుకమ్మలను పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి బొడ్డెమ్మలు వేసి ఆడి పాడారు. స్థానిక వాసవి మాత, నీలకంఠేశ్వరుడు, బాలబ్రహ్మేశ్వర ఆలయాలు, కేశవనగర్, భార్గవీనగర్‌లో, శివాజీనగర్‌తో పాటు మండలంలోని గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున వేపకాయల బతుకమ్మ వేడుకలను సంబురంగా నిర్వహించారు. అనంతరం గ్రామాల్లోని చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి పూజలు చేశారు.

11న అమరచింతలో సద్దుల బతుకమ్మ

అమరచింత: బతుకమ్మ సంబురాలను పురస్కరించుకుని ఈనెల 11న పట్టణంలోని దశమికట్ట వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మేర్వరాజు తెలిపారు. ఈ వేడుకలకు పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు బతుకమ్మలతో తరలిరావాలని కోరారు.

జాతీయ స్థాయి క్రీడలకు దివ్య ఎంపిక



ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేటకు చెందిన జి.దివ్య జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు రాష్ట్ర షూటింగ్ బాల్ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా షూటింగ్ బాల్ కన్వీనర్ విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన 43వ షూటింగ్ బాల్ సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో దివ్య ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తరఫున పాల్గొని రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిందన్నారు. అసమాన ప్రతిభ కనబర్చిన దివ్య జాతీయస్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. నవంబర్ 27 నుంచి 30 వరకు బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరిగే జాతీయ స్థాయి 43వ జాతీయస్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ క్రీడల్లో తెలంగాణ బాలికల జట్టు తరఫున దివ్య పాల్గొంటుందన్నారురు. ఈ సందర్భంగా దివ్యను గ్రామస్తులు తిరుపతయ్య, వెంకటేష్, రాఘవేంద్ర, తలారి అంజనేయులు, పవన్‌కుమార్, వెంకటేష్, శివ తదితరులు శాలువాతో సన్మానించి, అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

మదనాపురం: పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా కదిరె లక్ష్మయ్య మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగిన 35వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో బుధవారం ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

మహనీయులకు ఘన నివాళి



వనపర్తిలో చేగువేరా, కాన్షీరాం చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా 57వ వర్ధంతి, మాన్యవార్ కాన్షీరాం 18వ వర్ధంతి వేడుకలు మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బైరోజు గిరి, రాజా చారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, గంధం నాగరాజు, మండ్లల దేవన్ననాయుడు, బాలేమియా, పానుగంటి యేసోప్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో..

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాన్యశ్రీ కాన్షీరాం చిత్రపటానికి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణమహారాజు, నత్తి సుధాకర్, ఎల్లస్వామి, అశోక్, మన్యం, ఈశ్వర్, శశి, కుర్మన్న, శాంతన్న పాల్గొన్నారు.

చేగువేరా ఆశయ సాధనకు..

వనపర్తి రూరల్: ప్రపంచ విప్లవయోదుడు చేగువేరా కలలుగన్న సమసమాజ ఆశయ సాధన కోసం పోరాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రమేష్, గోపాలకృష్ణ, ఎత్తం మహేష్, కళావతమ్మ, రమేష్, పృథ్వీరాజు, విష్ణు, జయమ్మ, శిరీష, లక్ష్మీనారాయణ, మోహన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బకాయిలు చెల్లించాలి

వనపర్తి రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు 7 నెలలుగా చెల్లించడం లేదని, బకాయిలను వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలపై బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆయన వనపర్తి జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ హజీరాబేగం కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, జ్యోతి, రమాదేవి, రమ, విజ్జలత, భాగ్యలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు

అమరచింత: పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అమరచింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సద్దాల శ్రీనివాస్‌ను ఎన్నుకోవడం హర్షనీయమని మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు రాజు, వెంకటన్న తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తూ అందరి మన్ననలు పొందిన సద్దాల శ్రీనివాసులుకు రాష్ట్ర శాఖలో సముచిత స్థానం కల్పించడం సంతోషకరమన్నారు. శ్రీనివాసులు ఎన్నికపై మండల పీఆర్‌టీయూ సభ్యులు వగ్గు రాఘవేందర్, విజయ్, విజయ్‌ప్రకాష్, కొండా సత్యనారాయణ, శ్రీరాములు, హనుమంతు, శిల్ప, జయలక్ష్మి అభినందనలు తెలిపారు.

సీసీ వేశారు.. క్యూరింగ్ మరిచారు

అమరచింత: పట్టణంలోని శ్రీ జములేశ్వరి మాత ఆలయం నుంచి 300 మీటర్ల మేర నిర్మించిన సీసీ రహదారికి క్యూరింగ్ చేయడం విస్మరిస్తున్నారు. మూడు రోజుల కిందట రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని నాణ్యత ప్రమాణాలకు పాటించని కాంట్రాక్టర్ కనీసం క్యూరింగ్ సైతం చేయకపోవడంతో రహదారి త్వరగా పాడైపోతుందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్యూరింగ్ చేపట్టాలని కోరుతున్నారు.



వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలి

పాన్‌గల్: చిన్నారుల వ్యాధి నిరోధక టీకాలపై వారి తల్లిదండ్రులను చైతన్యం చేస్తూ సకాలంలో వేయించేలా చూడాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సందర్శించి చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు టీటీ వ్యాక్సిన్‌పై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు బీసీజీ, పోలియో నివారణకు, కామెర్లు, కోరింత దగ్గు, ధనుర్వాతం, నిమోనియా, తట్టు, రెబెల్లా వ్యాధి, అంధత్వ నివారణకు అవసరమగు టీకాలు, విటమిన్ ద్రావణాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రాలల్లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించి భవిష్యత్తులో వచ్చే అంటు వ్యాధుల నుంచి కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ తార శశాంక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టీకాలను పరిశీలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

వీపనగండ్ల: వరి పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే యాజమాన్య పద్ధతులు అవలంభించాలని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం వల్లాభాపురం శివారులో రైతులు సాగు చేసిన పంట పొలాలను ఆయన సందర్శించారు. ఆకుముడుత పురుగు, శిడిదోమ వరిపంటను పాడు చేసే పరిస్థితులు నెలకొన్నాయని, వాటి నివారణ కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. శాస్త్రీయ పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు పొందొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విజయ్‌గౌడ్, రైతులు గట్టయ్య, రాంబాబు, సత్తయ్య, గంగుల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ డాకేశ్వర్‌గౌడ్

‘స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి’

వనపర్తి టౌన్: స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా సభ్యత్వాల నమోదు ఉండాలని పార్టీ రాష్ట్ర నాయకుడు, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జ్ వేములు నరేందర్‌రావు అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వనపర్తి అసెంబ్లీ సభ్యత్వ సమన్వయకర్త మున్నూరు రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తల కృషితోనే హర్యానాలో పార్టీ హ్యాట్రిక్ విజయం సాధించిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ దుందుభి మోగించి 2029లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం చేపట్టబోతుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతుందని సభ్యత్వ నమోదు సమన్వయకర్త మున్నూరు రవీందర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ తెలిపారు. రాష్ట్ర పార్టీ నిర్దేశించిన 35 వేల సభ్యత్వాల్లో 15 వేలు పూర్తయ్యాయని, 15వ తేదీ వరకు లక్ష్యం పూర్తి చేస్తామని చెప్పారు. ఆరు గ్యారెంటీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్, సభ్యత్వ నమోదు జిల్లా కన్వీనర్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, యువమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరె మధు, జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, గౌని హేమారెడ్డి, రామన్నగారి వెంకటేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బోయల రామ్మోహన్, జిల్లా అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ పెద్దిరాజు, మహిళామోర్చా మాజీ జిల్లా అధ్యక్షురాలు కల్పన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిరుపేదలకు దుస్తులు పంపిణీ

ఆత్మకూర్: వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో నిత్యం సేవా కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తున్నామని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ బిలకంటి జగదీశ్వర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పులిమామిడి రమేష్‌శెట్టి అన్నారు. బుధవారం స్థానిక వాసవీమాత ఆలయంలో దసరాను పురస్కరించుకుని నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, రాఘవేందర్, శివ, సుజన, దీప్తి, భవానీ, బాలేశ్వర్, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, ఈశ్వర్, అనీల్, పవన్, సహదేవ్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు టీషర్ట్స్..

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌లో దసరా పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కాంగ్రెస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకుడు వడ్డె శేఖర్ టీషర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉదయ్‌సాగర్, రాజశేఖర్, శ్రీరాం, నరేష్, పవన్, ప్రేమ్, రాజు, రమేష్, సాధిక్, మహ్మద్, ధర్మేందర్, వెంకటేష్, రాజు, రమేష్, యాదయ్య, నరేష్, బుజ్జి, నాని, రమేష్‌గౌడ్, హేమంత్, శివ, రాహుల్, వినోద్, సురేష్ తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మాన్ని పాటించాలి

ఆత్మకూర్: హిందువులందరూ తమ ధర్మాన్ని తప్పకుండా పాటించాలని, నిత్యం విగ్రహారాధన చేయాలని నందికొండ గాయత్రీదేవి పీఠాధిపతి సద్గురు డాక్టర్ కాంతేంద్రస్వామి అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లోని కేశవనగర్‌లో స్వర్ణకారుల ఆధ్వర్యంలో స్వామివారి సందేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వకర్మ మహనీయుడని, ఆయన చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని సూచించారు. మద్య, మాంసాలకు దూరంగా ఉండాలని, మనుషులతో ప్రేమ, దయ, జాలి గుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బంగారు భాస్కర్, పిన్నంచర్ల ప్రకాష్, డీకే ప్రకాష్, నరేష్, బాలరాజు, రవి తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఖిల్లాఘనపురం: విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని బీజేపీ జిల్లా పంచాయతీరాజ్ సెల్ అధ్యక్షుడు విక్రం, బీజేపీ సీనియర్ నాయకులు అనుజ్ఞారెడ్డి, భాస్కర్‌శెట్టి అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాంపల్లిలో సుష్మాస్వరాజ్ స్మారక మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు సుష్మాస్వరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతో పాటుగా శారీరక ధృడత్వం కలిగిస్తాయన్నారు. నిర్వాహకులు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16 జట్లు పోటీలకు హాజరైనట్లు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ఆత్మకూర్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలతో పాటు ఇల్లు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. 2008లో అప్పటి ఎమ్మెల్యే స్వర్ణమ్మ సర్వే నంబర్ 288లో 16 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 70 గజాల చొప్పున 1,200 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసినా.. నేటి వరకు స్థలాలు అప్పగించలేదని అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు వెంటనే పొజిషన్ చూపి, ఇళ్లు కట్టుకునేందుకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, జీఎస్ గోపి, భారతీయుడు, రాములు, సామేలు, వెంకటేష్, కృష్ణయ్య, లబ్ధిదారులు ఉన్నారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలు: మౌనిక ప్రతిభ



మౌనిక

పాన్‌గల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక ఉద్యోగం సాధించడమే గొప్ప.. అంటే రెండు ఉద్యోగాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది మౌనిక. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని మల్లాయిపల్లికి చెందిన పసుపుల మౌనిక ఇటీవల విడుదల చేసిన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచింది. గతేడాది నిర్వహించిన ఐఆర్పీ పరీక్షల్లో కూడా ఎన్నికై సంవత్సరం కాలం పాటు రేవల్లి మండల కేంద్రంలోని పాఠశాలల్లో స్పెషల్ టీచర్‌గా విధులు నిర్వహించారు. ఇద్దరు ఆడ పిల్లల తల్లిగా ఒక వైపు.. ఐఆర్పీగా పాఠశాలల్లో పనిచేస్తూనే భర్త పవన్‌కుమార్ ప్రోత్సాహంతో ఈ విజయం సాధించినట్లు ఆమె పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమరచింత: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు పోసిరి గారి విష్ణు తండ్రి పోసిరి గారి దశరథ్ వారం రోజుల కిందట మృతి చెందటంతో బాధిత కుటుంబ సభ్యులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బుధవారం పరామర్శించారు. కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ కుమార్ ఉన్నారు.